

హజ్ హౌస్‌ను పరిశీలిస్తున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, చిత్రంలో ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ నేత అమీర్‌బాబు తదితరులు



హజ్‌హౌస్‌ను వినియోగంలోకి తెస్తాం

● శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్

చెన్నూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన హజ్‌హౌస్‌ను రూ.25 కోట్లతో నిర్మిస్తే వైసీపీ పాలనలో నిర్లక్ష్యం చేసి పూర్తిగా విధ్వంసానికి పాల్పడ్డారని శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేశారు. తాము హజ్‌హౌస్‌ను తిరిగి వినియోగంలోకి తెస్తామని అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని హజ్‌హౌస్‌ను ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డితో కలిసి పరిశీలించారు. హజ్‌హౌస్‌లో దెబ్బతిన్న గోడలు, కాలిపోయిన వైర్లు, పైపులు, పగిలిన కిటికీలు, కాలిన డోర్లు, సప్పట.. ఇలా ప్రతి గది పాడుబడి ఉండడాన్ని చూసి ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు ముస్లిం మైనార్టీల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి పవిత్ర హజ్‌భవనం నిర్మిస్తే చివరికి ఎన్నిరకాలుగా పాడు చేయాలో అన్ని రకాలుగా జగన్ ధ్వంసం చేశారని మండిపడ్డారు. జిల్లా వాసులుగా వైసీపీ పాలనలో సీఎం జగన్, ఆయన మేనమామ కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, డిప్యూటీ సీఎంగా అంజద్‌బాషా ఉండి కూడా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కనీసం ఒక్క వాచ్‌మాన్‌ను కూడా పెట్టకుండా భవనాన్ని గాలికి వదిలేశారని, తద్వారా రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. ఇంతకన్నా కక్షసాధింపు చర్యలు ఎక్కడైనా ఉంటాయా అని ప్రశ్నించారు. ముస్లిం మైనారిటీలు రాష్ట్రంలో టీడీపీకి అఖండ మెజారిటీ ఇచ్చారని.. ఈ నేపథ్యంలో రూ.10 కోట్లు మంజూరు చేయించి హజ్ భవనాన్ని వినియోగంలోకి తెస్తామన్నారు. కడప నగరానికి పక్కనే అటు ఎయిర్‌పోర్టు, ఇటు రైల్వేస్టేషన్, మరో వైపు హైవే రహదారికి పక్కనే ఉన్న ఈ భవనం రానున్న కొద్దికాలంలో పవిత్రమైన మక్కా యాత్రకు అనుకూలంగా మారుతుందన్నారు. గత టీడీపీ పాలనలో హజ్‌భవనంలో ఏమేం చేస్తామని చెప్పామో అవన్నీ కచ్చితంగా చేసి తీరుతామన్నారు. అంతేకాక మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసు, కోచింగ్ సెంటర్లు, ఖాళీ టైంలో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు ఇలా అన్నిరకాలుగా ఉపయోగపడేలా చేస్తామన్నారు. హజ్‌భవనంలో ఏమేం వసతులు కావాలో ఏమాత్రం పాడయిందో వాటికి ఎంత ఖర్చు పెట్టాలో వివరాలను తయారు చేసి ఇవ్వాలని మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ ఇమ్రాన్‌ను, డీఈ డీఎం లక్ష్మినరసంహను ఆదేశించారు. అలాగే పగలు రాత్రి భవనం చూసుకునేందుకు మౌజమ్‌లను, వాచ్‌మేన్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అందమైన గార్డెన్, రోడ్లు, మంచి వసతులు ఉండేలా హజ్‌హౌస్ వద్ద ఆహ్లాదకర వాతావరణం తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నేతలు అమీర్‌బాబు, ముక్తియార్, జిల్లా మైనార్టీ నాయకులు షబ్బీర్, మాజీ డిప్యూటీ మేయరు నబీరసూల్, మన్నూరు అక్బర్, మంజూరు అహ్మద్, కోఆప్షన్ సభ్యులు గౌస్‌పీర్, సీనియర్ మైనార్టీ నాయకులు గౌస్‌లాజం, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖకు 'ఏ' గ్రేడ్

కడప కలెక్టరేట్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో పేదలకు కాన్పులు, రోగులకు ల్యాబ్ పరీక్షలు, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించినందుకు రాష్ట్రంలో కడప జిల్లాకు 'ఏ' గ్రేడ్ ప్రకటించారని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పేదలకు అంకితభావంతో సరియైన సమయంలో వైద్యసేవలు అందించినందుకు డిసెంబరు ప్రగతి నివేదికలో జిల్లాకు ఏ గ్రేడ్ వచ్చిందని తెలిపారు. ఈ మేరకు వైద్య సేవలు అందించిన వైద్యాధికారులకు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు.

విమానాశ్రయాన్ని పరిశీలించిన ఎస్పీ

కడప క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 1వ తేదీ శనివారం అన్నమయ్య జిల్లా పర్యటన నిమిత్తం ప్రత్యేక విమానంలో రానున్న నేపథ్యంలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ కడప విమానాశ్రయాన్ని గురువారం పరిశీలించారు. ఇక్కడ చేపట్టవలసిన భద్రతా చర్యలపై పోలీసు అధికారులు, సిబ్బందికి దిశనిర్దేశం చేశారు. ఎయిర్‌పోర్టు వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయాలని, అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ (ఎఆర్) బి.రమణయ్య, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ దారెడ్డి భాస్కర్‌రెడ్డి, పోలీసు అధికారులు ఉన్నారు.



విమానాశ్రయంలో పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

అరకోటి నొక్కేశారు..!



● 15వ ఫైనాన్స్ నిధులలో చేతివాటం
● ఒంటిమిట్టలో రూ.27,93,367 గోల్‌మాల్ ● తొండూరులో రూ.22 లక్షలు హాంఫట్
● సుండుపల్లెలో నిబంధనలకు విరుద్ధంగా రూ.5 లక్షలు చెల్లింపు
● మొత్తం రూ.55 లక్షల ప్రభుత్వ నిధులు మాయం ● అవినీతి ఉద్యోగులలో దడ
● ఎంపీడీవో కార్యాలయాలలో అలజడి

కడప రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఎంపీడీవో కార్యాలయాలు అక్రమాలకు నిలయాలుగా మారాయి. జనరల్ ఫండ్ నిధులతో పాటు 15 వ ఫైనాన్స్ నిధులను పెద్దఎత్తున దారి మళ్లించారు. లక్షల నిధులను అప్పనంగా మింగేశారు. తిలాపాపం తలాపిడికెడు అన్నట్లు పంచుకుని తినేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ అవినీతి భాగోతాలు ఒక్కోటి బట్టబయలు అవుతున్నాయి. దీంతో అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. కాజేసిన నిధులను కక్కించేందుకు విచారణకు ఆదేశించింది. ఒంటిమిట్ట, తొండూరు, సుండుపల్లె మండల్లాలో చోటుచేసుకున్న అవినీతి వ్యవహారాన్ని నిగ్గుతేల్చేందుకు విచారణకు ఆదేశించింది. అడ్డదారుల్లో స్వాహా చేసిన ప్రభుత్వ నిధులను తిరిగి రాబట్టడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తోంది. దీంతో అక్రమార్కుల గుండెల్లో దడ మొదలైంది.

ఒంటిమిట్టలో రూ.27,93,367 గోల్‌మాల్

వైసీపీ పాలనలోని 2023-24 మధ్యకాలంలో ఒంటిమిట్ట ఎంపీడీవో కార్యాలయంలో దాదాపు రూ.27,93,367 మేర 15వ ఫైనాన్స్ నిధులు గోల్‌మాల్ అయ్యాయని సమాచారం. ఈ నిధులలో రూ.11.56 లక్షలు, అలాగే రూ.1.85 లక్షల మేర రెండు దఫాలుగా పంచాయతీ కార్యాలయంలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న ఓబులశెట్టి జనార్ధన్ ఖాతాలోకి అక్రమార్కులు బిల్లుల రూపంలో జమచేసినట్లు తెలుస్తోంది. ఈ మొత్తాన్ని జనార్ధన్ తన ఖాతా నుంచి సీనియర్ అసిస్టెంట్ జి.వరప్రసాద్‌కు, కంప్యూటర్ ఆపరేటర్ అలీ బేగ్‌కు పంపినట్లు తెలిసింది. రూ.27.93లక్షల్లో వీరు నొక్కేసిన రూ.13.41లక్షలు పోను మిగిలిన మొత్తానికి కూడా ఎం.బుక్కులు లేవని అంటున్నారు. కాగా.. ఎంపీడీవో, పంచాయతీ సర్పంచ్‌కు సంబంధించిన డిజిటల్ కీని కంప్యూటర్ ఆపరేటర్ అలీబేగ్ ఇవ్వడంలేదని.. అలీబేగ్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్ ఈ నెల 22 నుంచి విధులకు రావడంలేదని ఎంపీడీవో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిధుల గోల్‌మాల్‌పై విచారణ

ఒంటిమిట్ట మండలంలో చోటుచేసుకున్న 15వ ఆర్థిక సంఘం నిధుల గోల్‌మాల్‌పై కలెక్టర్ ఆదేశాల మేరకు జడ్పీశాఖ విచారణ చేపట్టింది. గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి (జమ్మలమడుగు డీఎల్‌డీవో) సుబ్రమణ్యంకు విచారణ బాధ్యతలు అప్పగించారు. ఆయన రెండు రోజుల క్రితం విచారణ చేపట్టారు. మంజూరైన నిధులు.. కేటాయింపులు.. చేపట్టిన పనులు.. ఎం.బుక్‌లు.. పాస్‌బుక్‌లు.. నగదు పుస్తకం.. ఓచర్లు తదితర వాటిని పరిశీలించారు. ఈ మేరకు రూ. 11.56 లక్షలు, అలాగే రూ.1.85 లక్షలు మేర మొత్తం రూ.13.41లక్షలు అక్రమంగా చెల్లించినట్లు నిర్ధారించినట్లు సమాచారం. తన ఖాతాలోకి వచ్చిన ఆ సొమ్ములను సీనియర్ అసిస్టెంట్ పి.వరప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ అలీబేగ్‌కు పంపినట్లు ఫిట్టర్ తిరుమలశెట్టి జనార్ధన్ విచారణాధికారులకు లిఖిత పూర్వకంగా తెలిపారని సమాచారం.

తొండూరులో రూ.22 లక్షల చేతివాటం

తొండూరు మండలంలో 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి రూ.22 లక్షల వరకు చేతివాటాన్ని ప్రదర్శించి అప్పనంగా తినేశారు. ఎంపీడీవోలకు ఓటీపీ రాకుండా ఎల్‌సీవోలు మేనేజ్ చేశారు. సదరు నిధులను కాంట్రాక్టర్‌కు చెల్లించకుండా థర్డ్ పార్టీకి పేమెంట్ చేసి అక్కడ నుంచి తినేశారు. ఈ వ్యవహారంపై పులివెందుల డీఎల్‌డీవో శ్రీనివాసులును విచారణ అధికారిగా నియమించారు.

సుండుపల్లెలో. రూ.5.23 లక్షలు..

అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలంలో నిబంధనలకు విరుద్ధంగా స్ట్రీట్‌లైట్లకు రూ.5.23 లక్షలు మండల పరిషత్ నిధులు చెల్లించి సొమ్ముచేసుకున్నారు. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో అధికారులకు భయం పట్టుకుంది.

ఎంపీడీవో కార్యాలయాలలో అలజడి

మండల పరిషత్ కార్యాలయాలకు మంజూరైన 15వ ఫైనాన్స్ నిధులలో చేతివాటంపై ఒట్టిమిట్ట, తొండూరు, సుండుపల్లె మండలాల్లో విచారణ జరుగుతుండడంతో ఉమ్మడి కడప జిల్లాలోని పలు ఎంపీడీవో కార్యాలయాల్లో ఉన్న అవినీతి ఉద్యోగులలో అలజడి మొదలైంది. ఇప్పటికే ఒంటిమిట్టలో రూ.27,93,367లు, తొండూరులో రూ.22.23 లక్షలు, సుండుపల్లెలో రూ.5 లక్షల మేర గోల్ మాల్ జరిగినట్లు గుర్తించి బాధ్యులపై చర్యలకు ఉపక్రమించారు. కేవలం 3 మండలాల్లోనే అరకోటికి పైగా నిధులను తినేసినట్లు అధికారుల విచారణలో లెక్కతేలింది. అన్ని మండలాల్లో విచారణ జరిపితే అధికారులు నొక్కేసిన సొమ్ము రూ.కోట్లల్లో ఉంటుందని ఆ శాఖ ఉద్యోగులే అంటున్నారు. దీంతో ఇతర మండలాల్లో కూడా 15వ ఆర్థిక సంఘం నిధుల అవకతవకలకు ఆస్కారం కల్పించిన అధికారులలో దడ మొదలైంది.

అవినీతి ఉద్యోగులపై కేసులు..



ఆయా మండల కార్యాలయాల్లో 15వ ఆర్థిక సంఘం నిధుల గోల్‌మాల్‌పై విచారణకు ఆదేశించాం. ఒంటిమిట్ట మండలంలో రూ.27,93,367లు, తొండూరు మండలంలో రూ.22 లక్షలు, సుండుపల్లెలో రూ.5 లక్షలు మొత్తం రూ.55 లక్షల వరకు గోల్‌మాల్ జరిగింది. ఇందులో తొండూరులో 80శాతం వరకు రికవరీ చేశాం. అలాగే సుండుపల్లె మండలంలో నిబంధనలకు విరుద్ధంగా చెల్లించిన రూ.5లక్షలు తిరిగి వసూలు చేశాం. ఇందుకు బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు చట్టపరంగా కేసులు ఫైల్ చేస్తున్నాం.

- ఓబులమ్మ, జడ్పీ సీఈవో



డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

కడప కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్ర జ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పనిచేసిన జీఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రామ్మోహన్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ రెవెన్యూ శాఖ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల సమయంలో ఓటర్ల జాబితా రూపొందించడంలో అవకతవకలకు పాల్పడ్డారని, ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ప్రొద్దుటూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పనిచేసిన ఎం.రామ్మోహన్‌ను గత ఏడాది జనవరి 3వ తేదీన ప్రభుత్వం సస్పెండ్ చేసింది. దీనిపై 2024 మే 22వ తేదీన రామ్మోహన్ తన వైపు నుంచి సంజాయిషీ పంపుకున్నారు. వీటిని పరిశీలించి సమీక్షించిన ప్రభుత్వం ఆయనపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తి వేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

మహాకుంభ మేళాకు కడప నుంచి ప్రత్యేక బస్సు



కడప మారుతీనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో సాగుతున్న మహాకుంభ మేళాకు వెళ్లాలనుకునే జిల్లా ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామని కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు బుధ వారం తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు సూపర్‌లగ్జరీ (వీడియో కోచ్- సర్వీస్ నెంబర్ 913000) బస్సు కడప డిపో నుంచి బయలు దేరుతుందన్నారు. 7 రోజుల పాటు ప్రయాణం సాగించనున్న బస్సు నాగపూర్, జబల్‌పూర్, రేవా, ప్రయాగరాజ్, వారణాసి మీదుగా అయోధ్య చేరుకుంటుందన్నా రు. తిరిగి ఇదే మార్గంలో 8వ తేదీన కడప చేరుతుందన్నారు. రాను, పోను చార్జీలు రూ.10 వేలన్నారు. భోజన సదుపాయాలు భక్తులే చూసుకోవాలని తెలిపారు. ప్రజలు టికెట్లను ఆన్‌లైన్ ద్వారా లేదా కడప బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్ ద్వారా టికెట్లు తీసుకోవాలని కోరారు.

పెద్దశేషవాహనంపై దేవదేవుడు



పెద్దశేషవాహనంలో దేవేరులతో కలసి ఊరేగుతున్న స్వామివారు

కడప కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడపగా ఖ్యాతి గాంచిన దేవునికడప శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నయనానందకరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజైన గురువారం రాత్రి 8గంటలకు దేవదేవుడు ఇరువురు దేవేరులతో కలిసి పెద్దశేషవాహనంపై దేవునికడప మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దివ్య స్వరూపాన్ని కనులారా తిలకించి ఆనందపారవశ్యం పొందారు. కాగా ఊరేగింపు ముందు భాగాన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కోలాట నృత్య కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులను రంజింపజేశారు. అంతకు ముందు ఉదయం 9గంటలకు దేవునికడప ఆలయ ప్రధాన అర్చకులు క్రిష్ణమోహన్, త్రివిక్రమ్, క్రిష్ణమూర్తి, సాయి, తరుణ్ సారథ్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీవారు సూర్యప్రభ వాహనంపై భక్తులను కటాక్షించారు. తదనంతరం ఉదయం 10.30గంటల నుంచి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు స్వామివారి ఊంజల్‌సేవ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవునికడప ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డితో పాటు పలువురు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

● ఇది వేటగాళ్ల పనే అంటూ బాధితుల ఆందోళన
● డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం బృందాలతో విచారణ





పొలంలో పడిఉన్న నరసింహారెడ్డి మృతదేహం.. ఇన్‌సెట్‌లో నరసింహారెడ్డి ఫైల్‌ఫొటో

బద్వేలుటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబంలో పుట్టి.. వ్యవసాయమనే జూదంలో ఎదురీదుతూ.. అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో.. వలసవెళ్లి బతుకుపోరాటం చేస్తున్న ఆ రైతు బుధవారం వేటగాళ్లు వేసిన విద్యుత్ కంచెతో ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ విషాద ఘటనకు సంబంధించి బాధితులు, పోలీసుల కథనం మేరకు.. బద్వేలు మండల పరిధిలోని వెంకటశెట్టిపల్లెకు చెందిన రైతు బీరం నరసింహారెడ్డి(55) తనకున్న మూడున్నర ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ, పండిన పంటలు సరిగా చేతికందకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతుండేవాడు. ఇతని ముగ్గురు కుమార్తెలకూ వివాహం జరిపించాడు. వ్యవసాయంలో అయిన అప్పులు తీర్చడానికి బెంగళూరుకు వలసవెళ్లి పీజీ (హాస్టల్) నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో భూ రీసర్వే జరుగుతోందని తెలిసి బుధవారం కుటుంబసభ్యులతో కలసి స్వగ్రామం వచ్చాడు. రాజుపాలెం గ్రామ పరిసరాల్లో తనకున్న పొలాన్ని అధికారులకు చూపించి రీసర్వే చేయించుకుని వస్తానని ఇంట్లో చెప్పి ఉదయం బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం దాటినా ఇంటికి తిరిగి రాలేదు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో పక్క పొలాల రైతులు వచ్చి పొలాల్లో నరసింహారెడ్డి మృతదేహం ఉందని చెప్పారు. అక్కడ కంపచెట్ల మధ్య విద్యుత్ తీగలు ఉన్నాయని, వాటికి చిక్కుకుని మరణించిన నరసింహారెడ్డి మృతదేహాన్ని మాయం చేసేందుకు వేటగాళ్లు ప్రయత్నించి.. వీలుకాకపోవడంతో సుమారు 2కిలోమీటర్ల మేర ఈడ్చుకుంటూ వెళ్లి కంపచెట్లలో పడవేశారని గ్రామస్థులు తెలిపారు. వెంటనే కుటుంబసభ్యులు సంఘటన స్థలానికి వెళ్లి విగతజీవిగా పడిఉన్న కుటుంబ పెద్దను చూసి రోదించారు. ఆయన కాళ్లు, చేతులు, శరీరం నల్లగా మారి, విద్యుత్తుషాక్‌తో మృతిచెందిన ఆనవాళ్లు కనిపించడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డుపై బంధువుల ఆందోళన

రైతు బీరం నరసింహారెడ్డి వేటగాళ్లు వన్యప్రాణులకోసం వేసిన విద్యుత్తు కంచెలో చిక్కుకుని మృతిచెందాడని, వెంటనే నిందితులను అరెస్టు చేయాలంటూ గురువారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వెంకటశెట్టిపల్లెలోని ప్రధాన రహదారిపై ఉంచి బంధువులు, గ్రామస్తులు ధర్నా చేపట్టారు. వేటగాళ్లు వేస్తున్న విద్యుత్తు కంచెలతో అనేక మూగజీవాలు, రైతులు చనిపోయారని అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రాస్తారోకోతో రహదారి వెంబడి సుమారు 3కిలోమీటర్ల వాహనాలు స్తంభించిపోవడంతో బద్వేలు రూరల్ సీఐ నాగభూషణం, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. విద్యుత్ కంచెలు వేయకుండా చూస్తామని, వన్యప్రాణుల వేటగాళ్లను గుర్తించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. అలాగే మృతదేహం వద్దకు వచ్చిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడి ఆ రైతుకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం రైతు మృతికి కారకులను కనుక్కునేందుకు డాగ్‌స్క్వాడ్‌ను, క్లూస్‌టీంను రప్పించి సంఘటన స్థలంలో సీఐ పరిశీలించారు.



డాగ్‌స్క్వాడ్‌తో విచారణ చేపట్టిన క్లూస్‌టీం



వెంకటశెట్టిపల్లెలో రాస్తారోకో చేపట్టిన మృతుడి బంధువులు, గ్రామస్థులు

అక్రమాలపై విచారణ



ఇసుక తరలింపుపై ఈవో మునిరాజును ప్రశ్నిస్తున్న విచారణాధికారి రామాంజనేయులు

- నివేదిక ఇవ్వాలంటూ లోకాయుక్త ఆదేశాలు
- విచారణాధికారిగా కర్నూలు డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు
- బి.కొత్తకోటలో అన్యాక్రాంతమైన దేవుడి మాన్యం భూముల పరిశీలన

బి.కొత్తకోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణ పరిధిలోని దేవుడి మాన్యం భూముల అక్రమాలపై వెళ్లిన ఫిర్యాదులపై ఎట్టకేలకు అధికారులు కదిలారు. విచారణాధికారిగా నియమితులైన కర్నూలు జిల్లా దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆర్ఎస్ రంగాపురం మద్దిలేటి నరసింహస్వామి ఆలయ ఈవో రామాంజనేయులు గురువారం బి.కొత్తకోట చేరుకుని విచారించారు.

బి.కొత్తకోట పట్టణంలోని ఆంజనేయస్వామి, చౌళేశ్వరస్వామి, నల్లగంగమ్మ ఆలయాలకు చెందిన రూ.కోట్ల విలువైన మాన్యం భూముల నిర్వహణలో అక్రమాల కారణంగా ప్రతియేటా రూ.లక్షల్లో దేవదాయ శాఖకు నష్టం వాటిల్లడమే కాక, విలువైన భూముల్లో ఇసుక తోడివేయడంతో భూమి ధ్వంసం, తదితర ఫిర్యాదులు దేవదాయశాఖ అధికారులతో పాటు రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో దీనిపై విచారించి నివేదిక ఇవ్వాలంటూ లోకాయుక్త రాష్ట్ర దేవదాయ కమిషనర్‌ను ఆదేశించింది. ఆ ఆదేశాల మేరకు రాష్ట్ర కమిషనర్ విచారణాధికారిని నియమించారు. ఈ అక్రమాలపై గతంలో ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది.

మాన్యం భూముల్లో తిరిగి..

విచారణాధికారి రామాంజనేయులు బి.కొత్తకోటలోని మాన్యం భూముల్లో తిరిగి ప్రతి అంశాన్ని నేరుగా పరిశీలించారు. రెవెన్యూ అధికారులను రప్పించి భూముల మ్యాప్‌ను పరిశీలించారు. పట్టణ శివారులోని ఆలేటివాగు పక్కనే ఉన్న చెన్నకేశవస్వామి మాన్యంలోని సర్వే నెంబర్-1840, 1726లలో ఇసుక తరలింపు వల్ల ఏర్పడ్డ గుంతలను, లీజు పాడుకున్న వారికి హద్దులు చూపని భూములను, ఏళ్ల తరబడి వేలం వేయని భూములను పరిశీలించారు. బెంగళూరు రోడ్డులోని గంగమ్మ మాన్యం సర్వే నెంబర్-326, 328లలోని 9 ఎకరాల విస్తీర్ణంలో నామమాత్రపు లీజుతో ఇటుకబట్టీలు, నర్సరీ తదితర వాటికి వినియోగించుకుంటున్న ఆరోపణపై భూమికి సంబంధించిన లీజు రసీదుల గురించి నిర్వాహకులను ఆరా తీశారు. తాము 12 ఏళ్లుగా ఉంటున్నామని చెల్లించిన డబ్బుకు ఈ ఏడాది మాత్రమే రసీదు ఇచ్చారని నిర్వాహకులు కమిషనర్‌కు వివరించారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండుగా వాడుకుంటున్న మాన్యం భూమిలో ఏర్పాటు చేసుకున్న బంకుల యజమానులను కమిషనర్ ప్రశ్నించారు. అధికారికంగా అనుమతులు ఇవ్వలేదని, అయినా నెలసరి అద్దె వసూలు చేసుకుంటున్నారని దుకాణదారులు చెప్పారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని మాన్యం భూముల విషయమై చర్చించారు. నిర్దేశించిన సర్వే నెంబర్లకు హద్దులు చూపి, నివేదిక ఇస్తే తాము తదుపరి చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని తహసీల్దార్‌ను డీసీ కోరారు.

నిన్ను చూసి పోవడానికి వచ్చానా..

లోకాయుక్తకు వెళ్లిన ఫిర్యాదులకు సంబంధించి ఆంజనేయస్వామి ఆలయం, వివిధ ఆలయాల మాన్యం భూముల వద్ద పరిశీలన సమయంలో పలుమార్లు వీటికి సంబంధించిన వివరాలు, రసీదులు ఇవ్వమని విచారణాధికారి బి.కొత్తకోట ఈవో మునిరాజును అడిగారు. ఏమి అడిగినా తన దగ్గర లేవని ఆఫీసులో ఉన్నాయని ఈవో బదులివ్వడంతో డీసీ రామాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమి లేవంటే ఎలా? అంత దూరం నుంచి నేను నిన్ను చూసిపోవడానికి వచ్చానా అని ప్రశ్నించారు. ఉద్యోగానికి న్యాయం చేయాలని, చేయలేనప్పుడు తప్పుకోవాలని చురకలంటించారు. ఈవోగా ఆరేళ్లుగా పనిచేస్తున్నా ఇటుక బట్టీల వారికి ఒక్క ఏడాది రసీదులు మాత్రమే ఇవ్వడంపై ప్రశ్నించగా ఈవో మౌనం వహించారు.



దేవుడి మాన్యం భూములపై గతంలో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలు

రాష్ట్ర కమిషనర్‌కు నివేదిక ఇస్తాం..

బి.కొత్తకోట దేవాలయాల మాన్యం భూముల విషయమై వచ్చిన ఫిర్యాదులపై లోకాయుక్త ఆదేశాల మేరకు విచారించాను. నిర్వహణ తీరు లోపభూయిష్టంగా ఉన్న మాట వాస్తవమే. రెవెన్యూ అధికారులు భూమి హద్దులు తేలిస్తే ఇసుక తరలింపుపై స్పష్టత వస్తుంది. విచారణలో తేలిన అంశాలతో రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కు నివేదిక పంపుతాం.

\- రామాంజనేయులు, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్, కర్నూలు జిల్లా

ఉద్యాన పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలి

అనంతరాజుపేట ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తలు



ప్రదర్శనను తిలకిస్తున్న అసోసియేట్ డీన్ శ్రీనివాస్

రైల్వేకోడూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలని అనంతరాజుపేట అసోసియేట్ డీన్ డాక్టర్ పీటీ శ్రీనివాస్ తెలిపారు. గురువారం తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గం డక్కిలిలో అనంతరాజుపేట ఉద్యాన కళాశాల, పెట్లూరు నిమ్మ పరిశోధన స్థానం వారు సంయుక్తంగా రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో నాల్గవ సంవత్సరం బీఎస్సీ ఉద్యాన కోర్సు చదువుతున్న విద్యార్థులు గ్రామీణ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా డక్కిలి గ్రామంలో 3 నెలలుగా రైతులతో కలిసి ఉద్యాన పంటల సాగును పరిశీలిస్తున్నారని తెలిపారు. తమ విద్యార్థులు పంట సాగులో మెళకువలు నేర్చుకున్నారని, విద్యార్థులు నేర్చుకున్న అంశాలపై రైతు సదస్సుతో పాటు ఉద్యాన పంటల ప్రదర్శన ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రధానంగా రైతులు ఉద్యాన పంటలను పండించే క్రమంలో యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పెట్లూరు నిమ్మ పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ రైతులకు పంటల సాగు, తెగుళ్ల నివారణలో ఎలాంటి సందేహాలు వచ్చినా శాస్త్రవేత్తలను సంప్రదించాలని తెలిపారు. అనంతరాజుపేట ఉద్యాన కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ వై.శిరీషా మాట్లాడుతూ తెగుళ్ల నివారణ, పురుగు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డక్కిలి మండల ఉద్యాన శాఖాధికారి ఆనంద్, ఉద్యాన కళాశాల ఏడీఆర్ డాక్టర్ బి.హరి, మల్లికార్జున రెడ్డి, నిమ్మ పరిశోధన స్థానం శాస్త్రవేత్త కాందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కుష్ఠువ్యాధిపై అవగాహన



కుష్ఠువ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో

సిద్దవటం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థిని, విద్యార్థులకు స్పర్శ కుష్ఠువ్యాధి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు పాల్గొని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. సిద్దవటం జడ్పీ హైస్కూల్లో గురువారం జాతీయ కుష్ఠు నివారణ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్ఠు నిర్మూలన కార్యక్రమం జరుగుతుందని, వ్యాధి నిర్మూలనకు మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా నిర్మూలనకు స్పర్శ లెప్రసీ అవేర్‌నెస్ క్యాంపెయిన్ నిర్వహించి తెలియజేశామని, చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం వంటి లక్షణాలు ఉన్నవారు స్థానిక వైద్యశాలకు వెళ్లి పరీక్షించుకోవాలన్నారు. అనంతరం కుష్ఠు నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అధికారి రవిబాబు, వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మీ, పాఠశాల హెడ్మాస్టర్ శ్రీరాములు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనకు అనుమతులివ్వండి

- అటవీశాఖను కోరిన పురావస్తుశాఖ
- లంకమల్లలో అరుదైన చిత్రాలు



లంకమల్లలో బండపై ఉన్న చిత్రాలు

సిద్దవటం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): లంకమల్ల అడవుల్లో అరుదైన చిత్రాలను పరిశీలించేందుకు భారతీయ పురావస్తు శాఖ డైరెక్టర్ డాక్టర్ మునిరత్నం అటవీశాఖ అనుమతుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. మండలంలోని లంకమల్ల అటవీ ప్రాంతంలో అరుదైన పురాతన చిత్రాలు బయటపడడంతో సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి భారతీయ పురావస్తుశాఖ అధికారులకు జనవరి 23న నివేదిక పంపించారు. రాయలసీమ ప్రాంతమైన లంకమల్ల అటవీ ప్రాంత సిద్దవటంలో లభించడం ఇదే మొదటిసారి అని, రాతి బండలపై శాసనాలు చెక్కబడి ఉన్నాయని, నాలుగో శతాబ్దపు మానవజాడలు తొలిసారిగా లభ్యం కావడంతో లంకమల్ల అడవుల్లో ఇలాంటి పురాతనమైన చిత్రాలు మరెన్నో ఉంటాయని, వీటిని వెలుగులోకి తీసుకొస్తే లంకమల్ల అందాలు పర్యాటకులకు కనువిందుగా ఉంటాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై భారతీయ పురావస్తుశాఖ డైరెక్టర్ డాక్టర్ మునిరత్నంను వివరణ కోరగా అనుమతుల కోసం అటవీశాఖ ఉన్నతాధికారులకు ఈనెల 26వ తేదీ నివేదిక పంపించామని, అనుమతులు రాగానే లంకమల్ల అటవీ ప్రాంతంలో పరిశీలిస్తామని ఆయన అన్నారు.

స్వర్ణ గ్రామ పంచాయతీగా చేద్దాం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సంబేపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనలో భాగంగా సంబేపల్లె గ్రామ పంచాయతీని స్వర్ణ గ్రామ పంచాయతీగా సిద్ధం చేద్దామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులకు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో హంగు, ఆర్భాటం లేకుండా ఎక్కడ చెట్లు, కొమ్మలు తొలగించకుండా పరిశుభ్రతతో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు తెలియజేశారు. చంద్రబాబు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై ఎంపీడీవో, తహసీల్దార్, స్థానిక అధికారులతో కలిసి చర్చించారు. రాష్ట్రంలో 2047 నాటికి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడమే లక్ష్యంగా సంక్షేమాన్ని చేపడతామని తెలియజేశారు. సంబేపల్లె స్వర్ణ గ్రామ పంచాయతీ సాధన కోసం 10 సూత్రాల అమలు కోసం వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు అభివృద్ధి, సంక్షేమం కోసం వెంటనే చర్యలు చేపట్టాలని తెలియజేశారు.

50 లక్షల రూపాయలతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలియజేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో పనితీరు సోలార్ విద్యుత్, యువత వివిధ రంగాల్లో శిక్షణా నైపుణ్యాలు ప్రజల ఆర్థిక జీవన స్థితిగతులను పెంచేందుకు చేపట్టవల్సిన పలు అంశాలపై అధికారులకు తెలియజేశారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



పోలీసు అధికారలాంఛనాలతో అంత్యక్రియలు, శశికుమార్ (ఫైల్)

వాల్మీకిపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉంటూ అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ పూజారి శశికుమార్ షిర్డీ (51) అంత్యక్రియలు గురువారం పోలీసు అధికార లాంఛనాలతో నిర్వహించారు. వాల్మీకిపురం మండలంలోని ఓబులంపల్లెకు చెందిన సీనియర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు పూజారి శశికుమార్ షిర్డీ శ్రీకాళహస్తిలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం సాయంత్రం అంత్యక్రియలు స్వగ్రామమైన ఓబులంపల్లెలో పోలీసు అధికార లాంఛనాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది, స్నేహితులు, బంధువులు శశికుమార్ మృతిపట్ల నివాళులర్పించారు.

నీటి ఎద్దడిపై ముందు జాగ్రత్త చర్యలు

ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు



జడ్పీ సీఈవో రవికుమార్‌తో మాట్లాడుతున్న తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు / పెద్దతిప్పసముద్రం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు తెలిపారు. ములకలచెరువు మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి జడ్పీ సీఈవోను కలిశారు. ముందస్తుగా తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.50 లక్షలు కేటాయించిందని, ఈ నిధులు తాగునీటి అవసరాలకు వినియోగించాలని జయచంద్రారెడ్డి సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. అలాగే వచ్చే నెల 7వ తేదీ మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని, సహకరించాలని సీఈవోను కోరారు. అనంతరం జడ్పీ సీఈవోను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరినారాయణ, టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నాయకులు శంకర్‌రెడ్డి, కేశవరెడ్డి, ఫజులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

మండలంలోని వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్య అనేది రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల అధికారులను చిత్తూరు జిల్లా జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు ఆదేశించాడు గురువారం ఆయన పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించారు.

మండల పరిషత్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి మండల నిధులను వాటి ఖర్చులను మిగిలిన నిధులను ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్‌ను అడిగి తెలుసుకున్నారు. మండల గ్రాంట్‌లో ఉన్న నిధులను ముందస్తుగా మండలంలో ఏ గ్రామంలోనూ మంచినీటి సమస్య అనేది రాకుండా చూడాలని వాటికి కావాల్సిన నిధులను వాడుకోవాలని, మంచినీటి సమస్యకు తప్ప ఈ నిధులను ఏ పనికీ వినియోగించరాదన్నారు. మంచినీటి సమస్యలపై ఆలసత్వం వహిస్తే అటువంటి అధికారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఆర్డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారి, ఏవో నిత్యానంద, టీడీపీ నాయకులు బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి, పట్టా చంద్రమోహన్‌రెడ్డి ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

డీకేటీ భూములకు పట్టాలపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కురబలకోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముదివేడు పంచాయతీ పరిధిలో డీకేటీ భూములకు పట్టాలు ఇవ్వడంపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'డీకేటీ భూములకు పట్టాలిచ్చేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి విచారణ చేపట్టారు. ముదివేడు పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్-1630లో దాదాపుగా 4.25 ఎకరాలకు తల్లీ, కొడుకులకు డీకేటీ పట్టాలు ఇవ్వడంపై విచారణ నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేయడంతో పాటు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

చెక్‌డ్యాంల మాట మరిచారా!

- నదుల నీరు వృథాగా సముద్రంపాలు
- చెక్‌డ్యాంలు నిర్మించాలంటున్న రైతులు



రైల్వేకోడూరులోని ముష్టేరు వద్ద గతంలో నిర్మించిన చెక్‌డ్యాంలో నిల్వ ఉన్న నీరు

రైల్వేకోడూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా కురుస్తున్న వర్షాలకు వరదనీరు భారీగా సముద్రం పాలవుతోందని, చెక్‌డ్యాంలు నిర్మించి ఉంటే కరువు ఉండదని రైతులు వాపోతున్నా ప్రజాప్రతినిధులకు పట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల ముందుచూపుతో చేసిన పనులు నేటికీ ఫలితాలు ఇస్తున్నాయని రైతులు అంటున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గం ఉద్యాన పంటలకు పెట్టింది పేరు. దక్షిణ భారతదేశంలో అరటి, బొప్పాయి, మామిడి పంటలను రైతులు, వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. రైల్వేకోడూరును మరో కోనసీమ అని కూడా పిలుస్తారు. రైల్వేకోడూరు ప్రాంతంలో ముష్టేరు, గుంజనేరు, గుండాలేరు, పుల్లంగేరు, మేకలగుంతేరు తదితర నదులు ఉన్నాయి. నదులకు సమీపంలో అడవులు ఉన్నాయి. అడవుల్లో కురిసిన వర్షం ఈ నదుల్లోకి వస్తుంది. ప్రతిఏటా కురుస్తున్న భారీ వర్షాలకు నీరు వృథాగా పోతోంది. నీటికట్టడికి అటు అధికారులు, ఇటు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవడంలో తీవ్రంగా విఫలమవుతున్నారు. ప్రతి నదిలో అక్కడక్కడా చెక్‌డ్యాంలు నిర్మించి ఉంటే ఏళ్ల తరబడి నీరు నిల్వ ఉండేది. అయితే చెక్‌డ్యాంలు లేకపోవడంతో నీరు వృథా కావడమే కాకుండా రైల్వేకోడూరు మండలంలోని ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో కరువుఛాయలు కనిపిస్తున్నాయి. గుంజననదిలో 8 చెక్‌డ్యాంలు, గుండాలేరులో 5 చెక్‌డ్యాంలు, మేకలగుంతేరుపై 4 చెక్‌డ్యాంలు, ముష్టేరు నదిపై 8 చెక్‌డ్యాంలు నిర్మిస్తే భూగర్భజలాలు అడుగంటే ప్రసక్తే ఉండదని రైతులు చెబుతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గానికి ఎటుచూసినా అడవులు ఉన్నాయి. ప్రత్యేకించి శేషాచలం, వెలుగొండ అడవుల నుంచి వర్షాకాలంలో వచ్చే నీరు నదుల్లో కలుస్తుంటాయి. వీటిని సద్వినియోగం చేసుకుంటే రైల్వేకోడూరుకు నీటి కొరత అనేది ఉండదని ఇది వరకే రైతులు ప్రజాప్రతినిధులకు విన్నపాలు చేసి ఉన్నారు. గతంలో తూతూమంత్రంగా చేసిన చెక్‌డ్యాంలు వరదనీటిలో కొట్టుకునిపోయాయి. పక్కా ప్రణాళికతో చెక్‌డ్యాంలు నిర్మిస్తే ఉత్తమ ఫలితాలు ఉంటాయని రైతులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముష్టేరు నదిపై రాజీవ్ గిరిజన కాలనీకి సమీపంలో చెక్‌డ్యాంను నిర్మించడంతో నేటికీ ఫలితాలు కనిపిస్తున్నాయి. నిర్మించిన చెక్‌డ్యాం నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. అదేవిధంగా చెక్‌డ్యాం చుట్టుపక్కల రక్షణ గోడ నిర్మాణం చేశారు. దీంతో రైతుల పొలాలు కోతకు గురి కాకుండా ఉన్నాయి. నీటి నిల్వ ఉండడంతో రైతులకు ఉపయోగకరంగా మారింది. రైల్వేకోడూరు ప్రాంతంలో ఉన్న నదులన్నింటికీ అనుసంధానం చేస్తే రైతులకు మేలు చేసే విధంగా ఉండడమే కాకుండా కరువు అనేది రాదని పాడి పంటలతో సస్యశ్యామలంగా ఉంటుందని రైతులు అంటున్నారు. గత ఏడాది తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు భారీగా నదుల్లో వరద నీరు చేరింది. ప్రస్తుతం ఉన్న నీరంతా వృథాగా పోతోంది. నదులను అనుసంధానం చేసి, చెక్‌డ్యాంలు నిర్మిస్తే నీటి నిల్వ ఉండడమే కాకుండా ఇటు రైతులకు అటు ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అంటున్నారు.



రైల్వేకోడూరులో గుంజననది నుంచి వృథాగా పోతున్న వరద నీరు (ఫైల్)

అనుసంధానం మాట మరిచిపోయారు



నదుల అనుసంధానం అనే మాటను నేతలు పూర్తిగా మరిచిపోయారు. గతంలో నదులను అనుసంధానం చేసి వాటిపై చెక్‌డ్యాంలు నిర్మించి ఉంటే నీటి నిలువ ఎప్పుడూ ఉండేది. చెక్‌డ్యాంల నిర్మాణాలు చేయకుండా పాలకులు నిర్లక్ష్యం చేశారు. అందువల్లే నేడు వచ్చిన నీరు సముద్రంపాలు కాక తప్పలేదు. ఇప్పటికైనా పాలకులు ఆలోచించి నదులను అనుసంధానం చేయాలి.

\- సాధు శివరామయ్య, ఆదర్శ రైతు, మైసూరివారిపల్లె

నీటిని నిల్వ ఉంచాలి



నీటిని నిల్వ ఉంచే ప్రయత్నాలు చేయాలి. వర్షాలకు నదుల్లోకి భారీగానే వరద నీరు వస్తుంది. కానీ ఆ నీటిని నిలబెట్టుకునే ప్రయత్నాలు ప్రభుత్వాలు చేస్తే అటు రైతులకు, ఇటు ప్రజలకు మేలు కలుగుతుంది. లేదంటే వచ్చిన నీరంతా వచ్చినట్లే పోతుంది. పాలకులు మంచి నిర్ణయాలు తీసుకుంటే నీటి నిల్వ వల్ల రైల్వేకోడూరు నియోజకవర్గం ఇంకా సస్యశ్యామలం అవుతుంది.

\- ఉంగరాల క్రిష్ణ, ఆదర్శ రైతు, రైల్వేకోడూరు

రూ.1.40 కోట్లు వృథా



విద్యార్థులు భోజనం చేసేందుకు ఉపయోగపడని కిచెన్ షెడ్డు



బ్రాహ్మణపల్లె పాఠశాలలో ఎండలో కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

- అలంకారప్రాయంగా డైనింగ్ హాల్స్
- కనిపించని ఆర్వో ప్లాంట్లు, కిచెన్ షెడ్లు
- చెట్ల కింద, ఎండలో భోజనం చేస్తున్న విద్యార్థులు

పులివెందుల రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తాం... కార్పొరేట్‌స్థాయి ప్రమాణాలతో విద్యార్థులకు విద్యతో పాటు సదుపాయాలు కల్పిస్తాం అని గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు ఆర్భాటపు ప్రకటనలు చేశారు. అయితే క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వసతులు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారు. దీంతో విద్యార్థులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే..

గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు పెద్ద డైనింగ్ హాల్స్ నిర్మించి.. అందులో టేబుళ్లు, కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేసేందుకు భారీగా నిధులు వెచ్చించారు. ఇందుకోసం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్ఈసీ) వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద పులివెందులలోని ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు కిచెన్ షెడ్లు, డైనింగ్ హాల్‌తో పాటు ఆర్వోప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. 2020 సెప్టెంబర్ 21న ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ మరియు వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) శాఖ పర్యవేక్షణలో పనులు చేపట్టారు. ఒక్కో పాఠశాల వద్ద కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్, ఆర్వోప్లాంట్ నిర్మాణానికి దాదాపు రూ.28లక్షలు ఖర్చు చేశారు. ఈ పనులు 31.03.2023 నాటికి పూర్తి కావాల్సి ఉంది. అయితే పనులు పూర్తి కాకుండానే 19-01-2024 తేదీ నాటికి ఆర్ఈసీ సంస్థకు బిల్లులు చెల్లించారు.



బ్రాహ్మణపల్లె పాఠశాలలో డైనింగ్ హాల్‌లో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

అలంకారప్రాయంగా...

పులివెందుల పరిధిలోని జడ్పీ ఉన్నత పాఠశాల (నల్లపురెడ్డిపల్లె), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (సత్రం), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (రవీంద్రనాథ), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలికల), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బ్రాహ్మణపల్లె)ల్లో నిర్మించిన డైనింగ్ హాల్స్ విద్యార్థులకు ఉపయోగపడలేదు. అందులో కూర్చునేందుకు సరైన వసతి కరువైనట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థులు పాఠశాల ఆవరణలో చెట్ల కింద, ఎండలో కూర్చొని భోజనం చేస్తున్నారు.

సగం పనే చేశారు...

ఆయా పాఠశాలల్లో కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్, ఆర్వోప్లాంటు నిర్మించాల్సి ఉంది. ఇందుకు గాను ఒక్కో పాఠశాలకు దాదాపు రూ.28 లక్షలు ఆర్ఈసీ ఖర్చు చేసినట్లు స్పష్టమవుతోంది. అయితే కిచెన్ షెడ్డు నిర్మాణం జరగలేదు, ఆర్వోప్లాంటు పూర్తికాలేదు. సగం పని మాత్రమే చేసినా.. మొత్తం బిల్లు మాత్రం చేసుకున్నారు. ఇదంతా అధికారులకు తెలిసి చేశారా లేక రాజకీయ ఒత్తిళ్లతో చేశారా అనేది తెలియాల్సి ఉంది. డైనింగ్ హాల్‌కు రూ.28లక్షలు ఖర్చు చేసి గోడలు, స్లాబ్ వేశారనుకుంటే.. స్టీల్ ప్యానల్స్ ఉపయోగించి తయారు చేసిన గోడ, పైకప్పులకు ప్యానల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే 2020-21 విద్యా సంవత్సరంలో నల్లపు రెడ్డిపల్లె పాఠశాలలో 710 మంది విద్యార్థులు, సత్రంలో 431, రవీంద్రనాథలో 190, బాలికల పాఠ శాలలో 430, బ్రాహ్మణపల్లెలో 143 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి నిర్మాణాలు కాకుండా అన్నిచోట్ల ఒకే రకమైన నిర్మాణాలు చేపట్టడం విశేషం. కేవలం వంద మంది కూడా కూర్చొని తినలేని పరిస్థితి. ఏదిఏమైనా రూ.1.40కోట్ల సీఎస్ఆర్ నిధుల్లో ఎంత ఖర్చు చేశారన్నది అధికారులే సమాధానం చెప్పాలి.

చిరునవ్వే అధికారుల సమాధానం

కిచెన్‌షెడ్డు, డైనింగ్ హాల్, ఆర్వోప్లాంట్ నిర్మాణాలకు సంబంధించి ఆంధ్రజ్యోతి విద్యాశాఖ అధికారులను, ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించగా చిరునవ్వే వారి సమాధానమైంది. సంబంధిత పనిని అప్పగించేటపుడు మీకు తెలిసి సంతకం పెట్టారా అంటే వారి నుంచి ఎటువంటి సమాధానం లేదు. హ్యాండింగ్ ఓవర్ సర్టిఫికేట్‌ను చూపించమని అడగ్గా అదంతా వద్దని చెప్పడం గమనార్హం. ఈ విషయమై ఏపీఈడబ్ల్యూఐడీసీ ఏఈ కుమార్‌ను వివరణ అడగ్గా నేమ్ ఆఫ్ వర్క్ ఎలా ఉంటే అలా చేశామని సమాధానమిచ్చారు. కానీ క్షేత్ర స్థాయి పరిశీలనలో కిచెన్ షెడ్లు, ఆర్వోప్లాంట్లు కనిపించక పోవడం విశేషం.

టిప్పర్, లారీ ఢీ... డ్రైవర్ మృతి



లారీ, టిప్పర్ ఢీకొన్న దృశ్యం.. ఇరుక్కుపోయిన మృతదేహం

ముద్దనూరు జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కడప-తాడిప్రతి హైవేలోని గంగాదేవిపల్లె గ్రామం వద్ద గురువారం సాయంత్రం టిప్పర్, లారీ ఢీకొన్న సంఘటనలో లారీ డ్రైవర్ రాంప్రసాద్(40)అక్కడిక్కడే మృతి చెందాడు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు వివరాలిలా.. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన రాంప్రసాద్ తాడిపత్రి నుంచి లారీలో బండలలోడు తీసుకొని వస్తుండగా.. ముద్దనూరు వైపు నుంచి టిప్పర్ వెళుతుండగా గంగాదేవిపల్లె వద్ద ఎదురుగా ఢీకొన్నాయి. లారీ ముందు భాగం పూర్తి నుజ్జు నుజ్జు కాగా రాంప్రసాద్ ఇరుక్కుపోయి అక్కడిక్కడే మృతి చెందాడు. టిప్పర్ డ్రైవర్ కిరణ్‌కు గాయాలవడంతో 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ దస్తగిరి ప్రమాదస్థలానికి చేరుకొని మృతదేహాన్ని క్రేన్ సహాయంతో బయటకు తీయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐతెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ముగ్గురికి గాయాలు

ఖాజీపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోసిరెడ్డిపల్లె హరిజనవాడ సమీపంలో ట్రాక్టర్‌ను బొలోరా వాహనం ఢీకొనడంతో బత్తిన హరికృష్ణ (26) అనే వ్యక్తి మృతి చెందగా..... మరో ముగ్గురికి గాయా లయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కడప నుంచి చికెన్ వ్యర్థాలతో ఖాజీపేట- బద్వేలు రహదారి మీదుగా నెల్లూరుకు వెళుతున్న బొలోరా వాహనం బోసిరెడ్డిపల్లె హరిజనవాడ వద్ద బుధవారం అర్ధరాత్రి ట్రాక్టర్ పంక్చర్ అయి ఆగి ఉండగా ఢీకొంది. దీంతో బొలోరా వాహనంలో ఉన్న హరికృష్ణ అనే వ్యక్తి మృతి చెందాడు. డ్రైవర్, క్లీనర్‌తో పాటు మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా, మృతుడు నంద్యాల జిల్లా గడివేముల మండలం చిగురుపాడు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

అధికారుల వేధింపులతో వ్యక్తి మృతి

- కుటుంబ సభ్యుల ఆరోపణ

కలసపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపల్లె గ్రామానికి చెందిన ఆకుల పుల్లయ్య బుధవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందాడు. పుల్లయ్య గత 30 సంవత్సరాల క్రితం కమలాపురం కాశిరెడ్డి వద్ద పది సెంట్ల పాడుబడిన ఇల్లు, ఖాళీ స్థలం కొనగోలు చేశాడు. ఆ స్థలంలో గడ్డివాములు, దిబ్బలు వేసుకుంటుండగా ఇటీవల రెవెన్యూ అధికారులు గ్రామస్తుల ఫిర్యాదుతో ప్రభుత్వ భూమి అని తేల్చి గడ్డివాములు, కంచెను తొలగించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన పుల్లయ్య మానసిక వత్తిడికి గురై బుధవారం మృతి చెందాడు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టరు సింధూజా, గ్రామ రెవెన్యూ అధికారి రామలక్షుమ్మ, పోలీసుల వత్తిడి వల్లనే పుల్లయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. గురువారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, పలువురు మండల నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కట్టెల బ్యాగు కోసి నాలుగు తులాల బంగారు చోరీ

జమ్మలమడుగు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని కెనరా బ్యాంకులో గురువారం ఇరగంరెడ్డి సావిత్రి అనే మహిళ గోల్డ్ లోన్ కోసం క్యూలో ఉండగా నాలుగు తులాల బంగారు నగలు చోరీ చేశారు. పెద్దదండ్లూరు గ్రామానికిచెందిన ఇరగంరెడ్డి సావిత్రి, భర్త రామమోహన్‌రెడ్డి కెనరా బ్యాంకులో గోల్డ్ లోన్ కోసం వచ్చారు. వరుసక్రమంలో నిలబడి అప్లికేషన్ పూర్తి చేసే సమయంలో ఆమె వెనుకే ఉన్న ఇద్దరు మహిళలు కట్టెల బ్యాగును కోసి పర్సులో ఉన్న తాళిబొట్టు సరుడు, మరో చైనును చోరీ చేశారు. ఈ మేరకు బాధితురాలు సావిత్రి అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే అర్బన్ సీఐ లింగప్ప, ఐడీ పార్టీ పోలీసులు బ్యాంకు వద్దకు వెళ్లి సీసీ కెమెరాలను పరిశీలించి.. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

గ్రావెల్ తోలుతున్న టిప్పర్లు సీజ్

కడప క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నానాపల్లి వద్ద మైనింగ్ గ్రావెల్ రవాణా చేస్తున్న ఆరు టిప్పర్లు, ఒక ట్రాక్టరును చిన్నచౌకు పోలీసులు గురువారం సీజ్ చేశారు. నానాపల్లి వద్ద ఉన్న కొండను తవ్వి నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ మట్టిని టిప్పర్ల ద్వారా రవాణా చేస్తున్నట్లు ఎప్పటినుంచో ఆరోపణలు వస్తున్నాయి.

ఈ నేపధ్యంలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాలతో సీఐ ఓబులేసుకు సమాచారం మేరకు చిన్నచౌకు పోలీసులు వైఎ్‌ఎఆర్‌కాలనీ వద్ద తనిఖీలు చేపట్టారు. మైనింగ్ వద్ద వెళుతున్న టిప్పర్లను గుర్తించారు. డ్రైవర్ల దగ్గర అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ప్రయాణికుల పట్ల డ్రైవర్లు మర్యాదగా మెలగాలి

- ఆర్టీసీ ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల పట్ల ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు మర్యాదగా మెలగాలని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు పొలిమేర గోపాల్‌రెడ్డి హెచ్చరించారు. అలా కాకుండా ఎవరైనా అమర్యాదగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గురువారం స్థానిక ఆర్టీసీ రీజనల్ కార్యాలయలో జిల్లాలోని ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రయాణికులు చేయి ఎత్తిన చోట బస్సు ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవలన్నారు. సమయపాలనతో బస్సులు నడిపి తద్వారా ప్రజల మన్ననలు చూరగొనాలని సూచించారు. ముఖ్యంగా మద్యపానం సేవించి విధులకు రాకూడదని, డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోనులో మాట్లాడరాదని అన్నారు. అద్దె బస్సుల యజమానులకు రావలసిన బకాయిలను త్వరితగతిన చెల్లించే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అద్దె బస్సుల యజమానుల సంఘం అధ్యక్షుడు భాస్కర్‌తో పాటు వివిధ డిపోలకు చెందిన అద్దెబస్సుల యజమానులు, ప్రొద్దుటూరు, కడప డి పో మేనేజర్లు మల్లికార్జునరెడ్డి, ఢిల్లేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అద్దెబస్సుల యజమానులతో మాట్లాడుతున్న ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఆమె భర్తపై కేసు

కొండాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటిపల్లె గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఆమె భర్త ఓంకార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. చౌటిపల్లె గ్రామానికి చెందిన గతంలో ఇదే పాఠశాలలో పనిచేసిన ఓ మహిళ తనను ప్రిన్సిపాల్ భర్త ఓంకార్ లైంగికంగా వేధిస్తున్నాడని, అదే విధంగా ప్రిన్సిపాల్ కూడా తనను తిడుతూ వేధిస్తోందని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ప్రిన్సిపాల్, ఆమె భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. ఈవిషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. మహిళ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అసత్య ఆరోపణలతో బ్లాక్‌మెయిల్ చేస్తోందని తాము కూడా ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

జాగ్వార్ బాత్ లైటింగ్ షోరూం ప్రారంభం

- వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి
- తెలుగు రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్ హరినాథ్‌బాబు



జాగ్వార్‌బాత్ లైటింగ్ షోరూమును ప్రారంభిస్తున్న ఏపీటీఎస్ రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్ పెండ్యాల హరినాథ్‌బాబు, జాగ్వార్ బ్రాంచ్ హెడ్ అభిజిత్‌సింగ్

కడప మారుతీనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గృహ వికాసానికి మారుతున్న కాలానికనుగుణంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన జాగ్వార్ బాత్ లైటింగ్స్‌ను వినియోగించుకోవాలని రెండు తెలుగు రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్, సూర్య ఇంటర్నేషన్ అధినేత డాక్టర్ పెండ్యాల హరినాథ్‌బాబు గృహ యజమానులకు సూచించారు. గురువారం స్థానిక చిన్నచౌకు బైపాస్ (బజాజ్ షోరూం పక్కన) నూతనంగా జాగ్వార్ బాత్ లైటింగ్ షోరూంను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా హరినాథ్‌బాబు మాట్లాడుతూ వినియోగదారులను సంతృప్తిపరిచేలా సరికొత్త డిజైన్లతో గల జాగ్వార్‌బాత్ లైటింగ్ సిస్టంను గృహ అవసరాలకు వినియోగించుకుని కుటుంబ అభిరుచులకు తగ్గట్లుగా వాడుకోవాలని సూచించారు. ఈ జాగ్వార్‌బాత్ లైటింగ్ పరికరాల అమ్మకాలు ఇండియాలోనే కాకుండా సుమా రు 55 దేశాల్లో ఇంటర్నేషనల్ స్థాయిలో అమ్మకాల ద్వారా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈఅవకాశాన్ని కడప నగర ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ గృహాలు కాంతులు విరజిమ్మేలా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాగ్వార్ బ్రాంచ్ హెడ్ అభిజిత్‌సింగ్, సూర్య ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరక్టరు వెంకటేశ్వర్‌రావు, ఏపీ ప్రాజెక్టు అండ్ రిటైల్ హెడ్ సాయిక్రిష్ణ, ఎండీఎస్ విజయ్‌కుమార్, జనతా ఏజన్సీస్ ప్రొప్రయిటర్ షేక్‌మహమ్మద్ ఆసిఫ్, జాగ్వార్ తెలంగాణ అండ్ ఏపీ ఎస్‌కో హెడ్ వంశీక్రిష్ణ, లైటింగ్ హెడ్ నవీన్‌కుమార్, ఏఎస్ఎం పి.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కులో తాత్కాలిక ప్లాట్ల కేటాయింపు పత్రాల పంపిణీ



పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

మైలవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మైలవరంటెక్స్‌టైల్ పార్కులో తాత్కాలిక ప్లాట్ల కేటాయింపు పత్రాలను లబ్ధిదారులకు మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. మైలవరం టెక్స్‌టైల్ పార్కులో హ్యాండ్‌లూమ్, పవర్‌లూమ్, గార్మెంట్, డైయింగ్ ప్లాట్లను టెక్స్‌టైల్ పార్కులో 118 ప్లాట్లకు గాను 93 మంది లబ్దిదారులకు తాత్కాలిక ప్లాట్ల పట్టాల పంపిణీ చేసినట్లు ఏడీ విచ్చేశ్వరరావు తెలిపారు. ఒక్కొక్కరికి 20 నుంచి 30 సెంట్ల వరకు కేటాయించి.. మూడు నెలల్లోగా అమౌంట్ టెక్స్‌టైల్ పార్కు అకౌంట్‌కు లబ్ధిదారులు జమ చేయాలన్నారు. లేనిపక్షంలో వారి ప్లాట్లను రద్దు చేయడం జరుగుతుందన్నారు. అమౌంట్ చెల్లించినవారికి అగ్రిమెంట్ చేసి వివిధ బ్యాంకుల ద్వారా లోన్లు తీసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో డీవో అహ్మద్, రవి, ప్రకాష్‌రెడ్డి, శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ మహిళా విభాగ సమన్వయకర్తల నియామకం

కడప ఎడ్యుకేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం మహిళా సెల్ సమన్వయకర్తలు, సభ్యులను నూతనంగా నియామకం చేశారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి నియామక ఉత్తర్వుల కాపీని నూతన కమిటీకి అందించారు. కోఆర్డినేటర్‌గా మైక్రోబయాలజీ విభాగం ప్రొఫెసర్ డి.విజయలక్ష్మి, కోఆర్డినేటర్‌గా అప్లైడ్ మ్యాథమేటిక్స్ విభాగం ప్రొఫెసర్ ఎల్.మాధవి, సభ్యులుగా జెనెటిక్స్ జెనోమిక్స్ విభాగం డాక్టర్ పి.ఉస్మాన్‌బాషా, అసోసియేట్ ప్రొఫెసర్, జంతుశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.అనుప్రసన్న, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం సూపరింటెండెంట్ ఎస్.సుమలత, అసిస్టెంట్ బి.ఎం.ఖాజా మొయినుద్దీన్, విద్యార్థి ప్రతినిధిగా ఒకరిని ఎంపిక చేశారు.

కడప ఉక్కును సాధించుకుందాం...

జమ్మలమడుగు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పార్టీల నేతలు ప్రధానమంత్రి మోడీ ముందు తలవంచి.. పది సంవత్సరాల నుంచి స్టీల్‌ప్లాంట్ విషయంలో మోసం చేస్తున్నారని సీపీఎం జీపు జాతాలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ తదితర వక్తలు విమర్శించారు. గురువారం జమ్మలమడుగు పట్టణంలోని పాత బస్టాండులో సీపీఎం జీపు జాతాను మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు ప్రారంభించారు. పాత బస్టాండులోని ఎద్దుల ఈశ్వరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమను సాధించుకోవడంలో టీడీపీ, వైసీపీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వాలు చేతకాని దద్దమ్మలుగా మారాయని విమర్శించారు. కడప ఉక్కు రాయలసీమ హక్కు అనే సంకల్పాన్ని పాలక పక్ష రాజకీయ పార్టీలు మరచిపోయాయన్నారు. కడప ఉక్కు అనేది విభజన చట్టంలో ఉన్న ఒక హక్కు అన్నారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అయినా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. బీజేపీ ఎన్నికల ఎత్తుగడలో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఇరుక్కుపోయి రాష్ట్ర ప్రయోజనాలను, కడప ఉక్కు పరిశ్రమను తాకట్టు పెట్టాయన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ఈ ప్రాంత ప్రజలకు ఒక ఆక్సిజన్ లాంటిదన్నారు. ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించే ఒక బృహత్తర పరిశ్రమపై రాజకీయ పార్టీలు దృష్టి పెట్టకపోవడం దురదృష్టకరమన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకులు రామన్న మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ గురించి జనసేన, టీడీపీ, వైసీపీ పార్టీలు కేంద్రంతో మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ కడపలో బ్రహ్మణికి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం సాధ్యమైనపుడు సెయిల్‌కు ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. పరిశ్రమ సాధనకోసం జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రధానంగా జమ్మలమడుగు ఎమ్మెల్యే బీజేపీ తరుపున పోరాడాలని లేనిచో రాజీనామా చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మనోహర్, శివకుమార్, అన్వేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఉక్కు పరిశ్రమ ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఉక్కు పరిశ్రమ శంకుస్థాపన వద్దకు చేరుకుని శిలాఫలకాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, చాంద్‌బాష, చేనేత కార్మిక సంఘం నాయకులు శివనారాయణ, జమ్మలమడుగు ప్రాంత సీపీఎం నాయకులు, విద్యార్థులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు కన్నెతీర్థంలో శిలాఫలకం వద్ద నినదిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఎం నాయకులు

మధ్యాహ్న భోజన పథకంలో మెనూ తప్పనిసరి

●ప్రభుత్వ మైనార్టీ సంబంధాల సలహాదారుడు మహమ్మద్ షరీఫ్


విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న మైనారిటీ సలహాదారుడు షరీఫ్ అహ్మద్, చిత్రంలో ఎమ్మెల్యే ఆర్. మాధవి తదితరులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ప్రభుత్వ మైనార్టీ సంబంధాల సలహాదారుడు మహమ్మద్ షరీఫ్ అహ్మద్ తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం కడప నగరం ఏపీమోడల్ ఉర్దూ బాయ్స్ పాఠశాలను ఆయనతో పాటు కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి సందర్శించారు. ముందుగా విద్యార్థులతో మాట్లాడారు. అక్కడున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి విద్యార్థీ బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా విద్యాశాఖ అధికారి శంషుద్దీన్, ఎంఈఓ గంగిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంటనే గౌరవ వేతనాలు ఇవ్వాలి

కడప(వినాయకనగర్),జనవరి30(ఆంధ్రజ్యోతి): మసీదులో ఉన్న ఇమాం, మైజంలకు వెంటనే గౌరవ వేతనాలు ఇవ్వాలని ముస్లింల ప్రభుత్వ సలహాదారుడు షరీఫ్‌ను కోరారు. హజ్‌హౌస్ పర్యటనకు వచ్చిన ఆయన్ను జేకే జనం కోసం యూత్ ఆధ్వర్యంలో సన్మానించారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడి తప్పకుండా గౌరవవేతనం వచ్చేలా చేస్తామని షరీఫ్ తెలిపారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు పక్కా స్కెచ్

● బోగస్ పొజిషన్ సర్టిఫికెట్లు సిద్ధం ● విలువ రూ.50 లక్షల పైమాటే


చెన్నూరు అంగన్వాడీ కేంద్రం పక్కన కబ్జా చేయాలనుకున్న ప్రభుత్వ స్థలం ఇదే..

చెన్నూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మేజరు గ్రామ పంచాయతీ అయిన చెన్నూరులో ఇళ్ల స్థలాల విలువ అమాంతంగా పెరిగింది. ఇక్కడ సెంటు స్థలం ధర రూ.2లక్షల నుంచి 30లక్షల వరకు పలుకుతోంది. హైవే రహదారికి దగ్గరగా ఉండడం, కడప నగరానికి సమీపం కావడంతో చెన్నూరు కూడా దాదాపు నగర పరిధిలోకే ఉన్నట్లుగా ఉంటుంది. ఇక్కడ స్థలాలు కబ్జా చేసేందుకు కొందరు వ్యక్తులు బోగస్ పొజిషన్ సర్టిఫికెట్లు తయారు చేస్తున్నారు. అవి కూడా రిటైర్డ్ అయిన తహసీల్దార్లు అయితే ఎలాంటి సమస్య ఉండదు, అడిగేవారు ఉండరని చెన్నూరులో కొందరు ఈ పని చేస్తున్నారు. ఈ స్థలం మాదేనని చెప్పుకుంటూ అందులో పాగా వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... చెన్నూరు నుంచి బుడ్డాయపల్లెకు వెళ్లే దారిలో చర్చి పక్కన ఉన్న అంగన్వాడీ కేంద్రం ఆనుకుని సుమారు 20 సెంట్లకు పైగా ఉన్న ఈ స్థలం సర్వేనెం.843/2బీ 2ఎగా ప్రభుత్వ స్థలంగా ఉంది. అయితే ఓ వ్యక్తి ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు పక్కా ప్లాను వేసుకుని మరికొందరిని తోడు చేసుకుని వారందరికీ ఒక్కొక్కరికి 2 సెంట్ల స్థలం చొప్పున ఇచ్చేందుకు బోగస్ పొజిషన్ సర్టిఫికెట్లు తయారు చేసినట్లు చెబుతారు. ఈ స్థలం మాదేనని గతంలో పలుమార్లు ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నించారు. ఆ తర్వాత ఇళ్ల నిర్మాణాల కోసం సిద్ధమయ్యాడు. అయితే అప్పట్లో తహసీల్దారుగా పనిచేసి ప్రస్తుతం ఆర్డీఓ స్థాయిలో ఉన్న శాంతమ్మ 2011లోనే ఈ విషయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇది ప్రభుత్వ స్థలం, దీంట్లో గ్రామ సమాఖ్య భవనం కట్టండని అప్పటి డీఆర్‌డీఏ పీడీకి, కలెక్టరుకు లేఖలు కూడా పంపించారు. ఈ మేరకు ఆ స్థలంలో బోర్డులు పాతారు. కొద్దిరోజుల పాటు కబ్జాదారులు ఆ స్థలంలోకి వెళ్లలేదు. ఈ నేపథ్యంలో తహసీల్దారు పదోన్నతిపై బదిలీ అయ్యారు. తర్వాత వచ్చిన మరో తహసీల్దారు కూడా ఈ విషయం గమనించి కబ్జాదారులకు అడ్డుకట్ట వేశారు. అప్పుడు కూడా ఆగిపోయింది. ఇటీవల కొంత కాలంగా ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు పాత బోగస్ సర్టిఫికెట్ దారులే మళ్లీ పుట్టుకొచ్చినట్లు తెలుస్తోంది. ఇళ్ల మధ్యనే ఉన్న విలువైన స్థలం అయినందున, దీంతో పాటు ఇక్కడ ఇంకా కొంత ప్రభుత్వ స్థలం ఉన్నందున దాన్ని కూడా కబ్జా చేయాలని ప్రయత్నాలు సాగిస్తున్నట్లు ఆ ప్రాంత ప్రజలే చెబుతున్నారు.

విలువ రూ.50లక్షల పైమాటే

అంగన్వాడీ కేంద్రం పక్కన ఉన్న ఈ స్థలం ప్రస్తుతం సెంటు ధర రూ.2.50 లక్షలు పలుకుతోంది. ఈ మొత్తం స్థలం రూ.50 లక్షల పైమాటే. ఈ స్థలంలో ప్రభుత్వ అధికారులు పెట్టిన బోర్డును కొందరు తొలగించి ఆ బోర్డును సైతం స్క్రాప్ కింద అమ్ముకున్నారు. అలాగే ఆ స్థలంలో మట్టి తోలించి చదను చేసి కబ్జా చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. మాకు రెవెన్యూ అధికారులు ఇచ్చిన సర్టిఫికెట్లు ఉన్నాయని పలువురికీ ఆ బోగస్ పొజిషన్ సర్టిఫికెట్లు చూపిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు



అది ప్రభుత్వ స్థలం. ఒక్క సెంటు కబ్జా చేసినా ఎవరినీ ఉపేక్షించం. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. ప్రభుత్వ అవసరాల కోసం తీసిపెట్టిన స్థలం అది. కావున ఎవరూ అందులో మట్టి తోలడం కానీ, నిర్మాణాలు కానీ చేపట్టరాదు. అందులోకి ఎవరు వెళ్లినా.. మట్టి తోలినా వారెంతటివారైనా సరే ఉపేక్షించేది లేదు. ఆక్రమిస్తున్నారని ప్రజలు ఫిర్యాదు చేసినా ఆక్రమణ దారులపై కేసులు నమోదు చేయిస్తాం.

- సరస్వతి, తహసీల్దారు, చెన్నూరు

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కడప మారుతీనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీ యూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆటో యూనియన్ నాలుగవ మహాసభలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వామనమూర్తితో పాటు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి హాజరై మాట్లాడారు. కడప జిల్లాలోనే 35వేల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారన్నారు. వీరంతా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేస్తున్నారన్నారు. కావున ఆటో కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నగరంలో ర్యాలీ

మహాసభల కార్యక్రమానికి ముందుగా నగర పాత రిమ్స్‌లోని ఆటో స్టాండు నుండి నగర పురవీధుల గుండా ర్యాలీ ప్రారంభమై ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డిసర్కిల్, కార్పొరేషన్ మీదుగా ప్రెస్‌క్లబ్‌కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి, ఏపీ ఆటోడ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు సుబ్బరాయుడు, ఆటోయూనియన్ నగర అధ్యక్షుడు పుల్లయ్య, నాయకులు రెడ్డయ్య, శివక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత: పెద్దిరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అతి తక్కువ కాలంలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత ప్రారంభమైందని మాజీమంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. చంద్రబాబు చేసిన తప్పుడు వాగ్దానాలకు ప్రజలు మోసపోయారన్నారు. వైసీపీ శ్రేణులంతా ఒక్కటిగా మారి రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. గురువారం కడపలోని ఎమ్మెస్సార్ హిల్ వ్యాలీలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముందుగా నూతనంగా నియమించిన జిల్లా కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరు అసంతృప్తితో ఉన్నారన్నారు. రాబోయే రోజుల్లో తిరుగులేని విజయం సాధిస్తామని తెలిపారు.

మిగతా జిల్లాలకు కడప జిల్లా మార్గదర్శకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అమర్‌నాథ్‌రెడ్డి, సుధా, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, రామసుబ్బారెడ్డి, రమేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కంటే అధ్వానంగా టీడీపీ పాలన: శైలజానాథ్

వేంపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దింపి అరాచక మద్య, జూద, మాదకద్రవ్య, గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా తయారుచేసి వెళ్లిపోయిందని.. ప్రస్తుతం వచ్చిన టీడీపీ కూటమి పాలన అంతకంటే అధ్వానంగా ఉందని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ మండిపడ్డారు. గురువారం వేంపల్లెలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి, పులివెందుల కాంగ్రెస్ ఇన్‌చార్జి ధ్రువకుమార్ రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పాలన పెనం మీద నుంచి నిప్పుల పొయ్యిలో పడ్డట్లయిందని విమర్శించారు. జగన్ అరచేతిలో వైకుంఠం చూపిస్తే చంద్రబాబు కైలాసం చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం కడప నగరం ద్వారకానగర్ ఎమ్మెల్యే నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప నియోజకవర్గంలోని ప్రజలు పాల్గొని వారి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలను పరిశీలించి ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి గురువారం తమ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి'

కడప క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కడప ట్రాఫిక్ సీఐ జావేద్ సూచించారు. 36వ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరి అన్నారు. కళాశాల అధ్యాపకులు, ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

కడప(వినాయకనగర్), జనవరి30(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ప్రభాకర్, కార్యదర్శిగా శరత్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా శివనాగేంద్ర, ఉపాధ్యక్షుడిగా బలరాంనాయక్, ప్రదీప్, దస్తగిరి, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాసులు, శివ, నవీన్, మరో 29 మంది సభ్యులుగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్యాలను యువతలోకి తీసుకెళ్లి హక్కుల కోసం ప్రాంత అభివృద్ధి కోసం పోరాటం చేస్తామన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

వేంపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి రుణాలకు బ్రాహ్మణులు దరఖాస్తు చేసుకోవాలని బ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎన్వీ ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇస్తున్నారని, ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకొని ఫిబ్రవరి 8 నుంచి 11 లోపు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

'తరగతుల తరలింపు తగదు'

వేంపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని విద్య నిర్వీర్యం అయ్యేలా 3,4,5 తరగతుల తరలింపు చర్య తగదని అలాంటి విధానం కోసం తీసుకొచ్చిన 117 జీఓను రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. బాధ్యతారాహిత్యంగా అధికారులు తరగతుల తరలింపునకు సిద్ధమవుతున్నారని, దీన్ని మానుకోవాలని కోరారు.

అవకాశం కల్పించాలి

కడప ఎడ్యుకేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాలలో ఎంకామ్ చదివేందుకు అవకాశం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జీవాల రాజు డిమాండ్ చేశారు. గురువారం యోగివేమన విశ్వవిద్యాలయంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి

●ఎక్సైజ్ శాఖ సీఐ చెన్నారెడ్డి


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి

పులివెందుల టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణంలో గీత కార్మికులకు పదిశాతం కేటాయిస్తామని, దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ సీఐ చెన్నారెడ్డి పేర్కొన్నారు. పులివెందుల నియోజకవర్గానికి మూడు షాపులు మంజూరయ్యాయన్నారు. స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీ, చక్రాయపేట, వేముల మండలాలకు ఒకటి చొప్పున కేటాయించారన్నారు. ఫిబ్రవరి 5వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా కానీ, తమ కార్యాలయంలో కానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తేదీ పరిశీలన ఉంటుందని, 7వ తేదీ లాటరీ ద్వారా షాపులు కేటాయిస్తామన్నారు. కుల ధ్రువీకరణ పత్రం, రెండు లక్షల డీడీ తీయాలన్నారు. సంవత్సరానికి పులివెందుల షాపునకు రూ.35లక్షలు, వేముల, చక్రాయపేటకు రూ.325000 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలి: సీపీఎం

వేంపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటుచేసి నిరుద్యోగ సమస్యను తీర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. 'కడప ఉక్కు-ఆంధ్రుల హక్కు' నినాదంతో నిర్వహించిన జీపుజాతా గురువారం వేంపల్లెకు చేరుకుంది. వేంపల్లె నాలుగురోడ్ల కూడలిలో చంద్రశేఖర్ మాట్లాడుతూ కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మించేందుకు బీజేపీ, టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు సాకులు చూపడం జరిగిందన్నారు. ఎన్‌డీఏలో భాగస్వామ్యంగా ఉన్న టీడీపీ పార్టీ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు.

భూ వివాదాలు లేకుండా చేయాలి

పులివెందుల టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భూ సర్వేలో గ్రామాల్లో ఎలాంటి వివాదాలు లేకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పులివెందుల ఆర్డీవో చిన్నయ్య కోరారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో పులివెందుల డివిజన్‌లో జరుగుతున్న రీసర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే చేసే సమయంలో అక్కడ ఉన్న రైతులకు నోటీసులు అందించి వారి సమక్షంలో కొలతలు వేయాలన్నారు. అలాగే ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే వారివి నమోదు చేయవద్దన్నారు. తల్లిదండ్రులు నుంచి సంక్రమించిన భూములకు వారి కుమారులకు హక్కులు ఉంటే రికార్డులు నమోదు చేయాలన్నారు. ఎక్కడా వివాదాలు లేకుండా సర్వే పూర్తి చేయాలన్నారు. లింగాల మండలంలో రీసర్వే చేస్తున్న విలేజీ సర్వేలకు ఎంపీడీవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అనంతరం డీఐ హేమలత మాట్లాడుతూ పులివెందుల డివిజన్ పరిధిలో రీసర్వే వేగవంతంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్లు విలేజీ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎదుట కార్మికుల ధర్నా

కడప(వినాయకనగర్), జనవరి30(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ సీఐటీయూ మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి సుంకర కిరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు, నగర అధ్యక్షుడు తిరుపాల్ మాట్లాడుతూ కార్మికులకు పీఎఫ్, ఏసీతో కూడిన వేతనాలు ఇవ్వలేదన్నారు. మహిళా కార్మికులపై వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. జీవో 36 ప్రకారం డ్రైవర్లకు వేతనాలు చెల్లించాలన్నారు. మాసాపేట రోడ్డు విస్తరణ ఇళ్లు కోల్పోయిన కార్మికులకు స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించాలన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్, సాయి, మస్తాన్, దస్తగిరమ్మ, ధరణి, సాయమ్మ, ఆరోగ్యమ్మ, పెంచలయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'అమరవీరుల త్యాగాల ఫలితమే స్వేచ్ఛ, సమానత్వం'

వేంపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల త్యాగాల ఫలితంగానే స్వేచ్ఛ, సమానత్వం లభించాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలనుసారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అమరవీరుల దినోత్సవం జరిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ ఆర్మీ కెప్టెన్ జి.మనోహర్ మాట్లాడుతూ భగత్‌సింగ్ మొదలు మహాత్మాగాంధీ వరకు అల్లూరి సీతారామరాజు మొదలు పొట్టిశ్రీరాములు వరకు అనేకమంది తమ జీవితాలను దేశం కోసం అర్పించారన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారులు ఓబుల్‌రెడ్డి, మల్లేశ్వరమ్మ, గంగాధర్, నాగలక్ష్మీదేవి, సఫీవుద్దీన్, పీడీ తేజేంద్ర, ప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు: మున్సిపల్ చైర్మన్

పులివెందుల రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తమ పాలన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప అన్నారు. గురువారం వారు స్థానిక వైసీపీ కార్యాలయంలో కౌన్సిలర్ కిశోర్‌తో కలిసి వారు విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పులివెందులలో ఏమేర అభివృద్ధి జరిగిందో ప్రజలందరికి తెలుసన్నారు.పెండింగ్ పనుల వద్దకు వెళ్లి ఉన్నవి లేనట్లుగా, లేనివి ఉన్నట్లు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కిషోర్, హఫీజుల్లా, గంగాదర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా త్యాగరాజస్వామి ఆరాధన

వేంపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలోని త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాలు వైభవంగా జరిగాయని డైరెక్టర్ ప్రొఫెసర్ కుమారస్వామి గుప్త తెలిపారు. గురువారం డైరెక్టర్, ఏఓ రవి కుమార్, సీఎంఓ అనిల్‌కుమార్‌రెడ్డి, లలిత కళల విభాగాధిపతి మొహిద్దీన్‌ఖాన్ పాల్గొన్నారు. గాత్ర ఉపాధ్యాయులు ఎం.జ్యోతీశ్వరన్, శ్రీలక్ష్మి తమ విద్యార్థి బృందంతో కలిసి సంగీత కచేరి చేయగా వయోలిన్‌పై దేవానంద, మృదంగంపై హరికృష్ణ వాయిద్య సహకారంతో అందరిని ఆకట్టుకున్నారు.

11వ బెటాలియన్ కమాండెంట్‌గా ఆనంద్‌రెడ్డి

కడప క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): 11వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈయన వెయిటింగ్ లిస్టులో ఉన్నారు. వైఎస్ఆర్ జిల్లాకు పోస్టింగ్ ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. రెండు, మూడురోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

కాపు కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి

వేంపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో కాపు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర, యువనాయకులు నామా వేమకుమార్‌లు కోరారు. గత ప్రభుత్వంలో అప్పటి నాయకులు స్థలం కేటాయించాలని కోరగా సంబంధిత ఫైల్ ప్రభుత్వ పరిశీలనలో పెండింగ్‌లో ఉందని తెలియజేశారు. కలెక్టర్, ఇతర అధికారులతో మాట్లాడి వేంపల్లెలో ఆకపులకు స్థలం కేటాయించేలా చూడాలని కోరగా సంబంధిత అధికారులందరితో మాట్లాడి చర్యలు తీసుకుంటానని బీటెక్ రవి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలి: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

వీరపునాయునిపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఏ పార్టీ అయినా గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వీరపునాయునిపల్లె మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. చేసిన పనులకు బిల్లులు రాలేదని ఎమ్మెల్యే వద్ద వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరికీ బిల్లులు చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ రఘునాథరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నల్లనమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

మండలంలోని కీర్తిపల్లెలో ఉన్న నల్లనమ్మ అమ్మవారిని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి దర్శించుకున్నారు. ముందుగా అమ్మవారికి పూజలు చేసి మొక్కుకున్నారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రామిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి, గండి ఓబయ్యయాదవ్, మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, పాయసంపల్లె మాజీ సర్పంచు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంకామ్ చదివేందుకు అవకాశం కల్పించాలి

కడప ఎడ్యుకేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాలలో ఎంకామ్ చదివేందుకు అవకాశం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జీవాల రాజు డిమాండ్ చేశారు. గురువారం వైవీయూలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతన విద్య విధానంలో భాగంగా ప్రభుత్వం నాలుగు డిగ్రీలు తీసుకుచ్చిందని, నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకొని హానర్స్ చేయడానికి యూనివర్సిటీ, యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో అవకాశం ఉందన్నారు.

భూసమస్యలపై ఆరా


తహసీల్దారు కార్యాలయం ఆకస్మికంగా తనిఖీ


రికార్డును పరిశీలిస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ

పెద్దముడియం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయాన్ని ఆర్డీఓ ఆదిమూలం సాయిశ్రీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్డీఓ తహసీల్దారు కార్యాలయం చేరుకుని రికార్డు రూములు, ఇతర గదులను పరిశీలించారు. ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులపై తహసీల్దారుతో చర్చించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు పరిష్కార మార్గాలు చూపారా అంటూ తహసీల్దారును అడిగారు. రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై మొత్తం వచ్చిన ఫిర్యాదులపై ఆర్డీఓ సాయిశ్రీ తహసీల్దారును అడిగారు. రైతులు రెవెన్యూ సమస్యలపై వస్తే సకాలంలో స్పందించి వాటిని పరిష్కరించాలని ఆర్డీఓ ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలన్నింటికీ త్వరగా పరిష్కారం చూపాలని ఆర్డీఓ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు బాలనరసింహులు, డీటీ గౌసియా, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో కేంద్ర బృందం తనిఖీ

అన్ని విభాగాలను సందర్శించిన బృందం


రిజిస్టర్లను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ప్రొద్దుటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో కేంద్ర వైద్య అధికారుల బృందం గురువారం తనిఖీ చేపట్టారు. ఢిల్లీ నుంచి వచ్చిన మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, విశాఖపట్టణం పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ వైద్య అధికారులు ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. క్యాజువాలిటీ, లేబర్‌రూం, ఏహెచ్‌యూ, హెచ్‌డీయూ ఏఆర్‌టీ, టీబీ, డీఈఐసీ బిల్డింగ్, సెంట్రల్ ల్యాబ్, ఎక్స్‌రే, సీటీ స్కాన్ ఎంఆర్‌ఐ డయాలసిస్‌ను పరిశీలించారు. ఈ విభాగాల రిజిస్ట్రర్లను పరిశీలించారు. 2023 ఏప్రిల్‌నుంచి 2024 డిసెంబరు వరకు ఆస్పత్రి బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులపై రికార్డులను పరిశీలించారు. బృందంలో డాక్టర్ రమణ, డాక్టర్ శ్రీనివాస్, డీసీహెచ్‌ఎస్ ఎస్‌ఓ ఏఎస్‌ఓ జిల్లా ఆస్పత్రి సూపరిండెంట్ ఆనంద్ బాబు నర్సింగ్ సూపరిండెంట్ పాల్గొన్నారు.

వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

బద్వేలు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పల్లెలవారిపల్లె డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం మలేరియా వైద్యాధికారి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. విద్యార్థులు, ప్రజలు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ, గున్యా తదితర వ్యాధులకు దోమలను నియంత్రించడంలో ప్రజలు, విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. స్పర్శలేని మచ్చలు ఉంటే వారికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, ప్రిన్సిపాల్ సుజిత, ఏఎన్‌ఎం ఈశ్వరమ్మ, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో అపోహలు దూరం

కుష్ఠు నిర్మూలనపై అవగాహన సదస్సు ● గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలి ● గాంధీవిగ్రహానికి ఘన నివాళులు


ప్రతిజ్ఞ చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కుష్ఠుపై ఉన్న అపోహలను అవగాహనతో దూరం చేయవచ్చని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా పేర్కొన్నారు. గురువారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జాతీయ కుష్ఠు నివారణ నిర్మూలన-'స్పర్శ' కుష్ఠువ్యాధి అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. కామనూరు, చెన్నంరాజుపల్లె, గోపవరం, సోములవారిపల్లెల్లో అవగాహన సదస్సులను నిర్వహించారు. కుష్ఠుపై సమాజంలో ఉన్న వివక్షతను ముగిద్దాం, గౌరవాన్ని స్వాగతిద్దాం అంటూ ప్రజలు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గురువారం నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు సచివాలయాల పరిధిలో అవగాహన నిర్వహిస్తున్నట్లు వివరించారు. డాక్టర్ ఎస్.శ్రీనివాస్, డీపీఎంఓ శ్రీను, సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ చంద్రకళ, ఉపాధ్యాయులు ప్రకాశం, మల్లికార్జున, కౌసిక్, సీహెచ్‌ఓలు గంగ, తులసి, నరసింహ, గంగాధర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్ఠు లక్షణాలపై అవగాహన

బి.కోడూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని వైద్యాధికారులు వినీత్‌కుమార్ రాజు, ఉదయ్‌కిరణ్ విద్యార్థులకు కుష్ఠుపై అవగాహన కల్పించారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, మెరిసే జిడ్డు గల చర్మం, చెవులు, వీపుపై, ఎదపై నొప్పి లేని బుడిపెలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు మూత పడకపోవడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు కలిగి ఉండడం, అరిచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, చల్లని లేదా వేడి వస్తువులు గుర్తించలేకపో వడం లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలని సూచించారు.

కుష్ఠును నివారించవచ్చు

బద్వేలు రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్పర్శలేని మచ్చలను గుర్తించడం ద్వారా కుష్ఠుకు మెరుగైన వైద్యం అందించవచ్చని తొట్టిగారిపల్లె వైద్యాధికారి వినయ్‌కుమార్ అన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని అవగాహన నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్‌ఎంలు, పాల్గొన్నారు.

గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలి

బద్వేలు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్య్రాన్ని తెచ్చేందుకు అహర్నిశలు కృషి చేసిన మహాత్మాగాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలని పట్టణ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు సుబ్బారావు, హాస్పిటల్ సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మైదుకూరు రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహానికి పట్టణ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం నివాళులర్పించారు. అనంతరం సీమాంక్ ఆస్పత్రిలో రోగులకు పండ్లను అందజేశారు. గౌరవాధ్యక్షుడు కె.చిన్నసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయంలో...

పోరుమామిళ్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గాంధీ చిత్రపటానికి సర్పంచ్ యనమల సుధాకర్ నివాళులర్పించారు. ఈఓ రవిశంకర్‌రెడ్డి, నరసింహులు, టీడీపీ నేతలు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట మండలంలో....

ఖాజీపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో గాంధీజీ వర్ధంతి నిర్వహించారు. ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి బస్టాండు కూడలిలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి మిఠాయిలు పంపిణీ చేశారు. టీడీపీ నేతలు నంద్యాల సుబ్బయ్య, ప్రతాప్‌రెడ్డి, సుంకు సత్యనారాయణ, కృష్ణచైతన్యరెడ్డి, రామసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో...

మైదుకూరు రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బాపూజీ జీవితం ఆదర్శనీయమని, ఆయన అడుగుజాడల్లోనే నడుద్దామని వాసవీ క్లబ్ రీజనల్ చైర్మెన్ సూరే సుబ్బరాజు తెలిపారు. స్థానిక అమ్మవారిశాలలో వాసవీక్లబ్, వనితాక్లబ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం ఆర్యవైశ్యులు నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఐఈసీ ఆఫీసర్ దొంతు సుబ్రహ్మణ్యం, జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ పబ్బతి గోపాల్, జిల్లా ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ గురుప్రసాద్, వనితాక్లబ్ అధ్యక్షురాలు కరములపాటి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆటో డ్రైవర్స్ యూనియన్ పట్టణ గౌరవాధ్యక్షుడు రామయ్య పేర్కొన్నారు. గురువారం కడపలో జరిగే ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా మహాసభలకు పట్టణంలోని ఆటో డ్రైవర్లు తరలి వెళ్లాలన్నారు. ఆటో వర్కర్స్ యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి హరి, సహాయ కార్యదర్శి యల్లయ్య, మాబు, వీరా పాల్గొన్నారు.

లబ్ధి చేకూర్చేందుకే మహిళలకు మెప్మా బజార్

బద్వేలుటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మరింత ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకే పేదరిక నిర్మూలన సంస్థ మహిళలకు మెప్మాబజారును ఏర్పాటు చేసిందని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మైదుకూరురోడ్డు అన్నాక్యాంటీన్ వద్ద మెప్మాబజార్‌ను ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసే ఉత్పత్తుల విక్రయాల ప్రోత్సాహకానికి మెప్మాబజారు వంటివి ఉపయోగకరంగా ఉంటాయన్నారు. విక్రయాలతో డ్వాక్రా మహిళలకు లాభాలు చేకూరాలన్నారు.

రాజుపాలెంలో ఉచిత పశువైద్యశిబిరం

బి.కోడూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాజుపాలెం గ్రామంలో గురువారం పశువైద్యాధికారి భరద్వాజ క్రిష్ణ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పశువులకు గర్భనిర్ధారణ పరీక్షలు, ఎదకు రాని పశువులకు వైద్యం, లేగదూడలకు నట్టల నివారణ, గొర్రెలు, మేకలకు మందులు తాపించారు. అనంతరం పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి 45 దూడలకు నట్టల నివారణ మందు తాపించారు. పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స నిర్వహించారు. గర్భనిర్ధారణ పరీక్షలు, వాటికి సంబంధించిన మందులు అందించారు. గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకిన వెంటనే సంబంధిత పశువైద్యాధికారికి తెలపాలని, వారు ఇచ్చేసలహా మేరకు మందులు వాడాలని సూచించారు. పశు సంవర్ధక సహాయకులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు సౌకర్యాలు కల్పించాలని వినతి

ప్రభుత్వ సలహాదారును కలిసిన ముక్తియార్


ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్‌కు బొకే ఇస్తున్న ముక్తియార్

ప్రొద్దుటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కడప హజ్ హౌస్ పరిశీలనకు వచ్చిన ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్‌ను ప్రొద్దుటూరు మున్సిపల్ మాజీ చైర్మెన్ వీఎస్ ముక్తియార్ కలిశారు. వైసీపీ ప్రభుత్వం హజ్‌హౌస్‌ను ధ్వంసం చేసి, కుట్రలు పన్ని మనుగడలేకుండా చేయాలని చూసిందన్నారు. కూటమి ప్రభుత్వంలో ముస్లింల సంక్షేమం కోసం హజ్‌హౌస్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చి ముస్లింలు హజ్ వెళ్లే సౌకర్యాలు మెరుగు పరచాలన్నారు. ఇందుకు ఆయన స్పందిచారని ముక్తియార్ తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. గురువారం అమరవీరుల దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 115 యూనిట్ల రక్తం సేకరించి రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు పెట్టుకోకుండా ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. పశువైద్యులు ఇందిర, వాణి, జ్యోతి, రాజాకుమార్, చరిత, హరిప్రియ, రాయల్‌రెడ్డి, అశోక్, శ్రీవాణి, అనూష పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ


దివ్యాంగులకు దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గురువారం ఆర్యవైశ్య వృద్ధాశ్రమం వద్ద దివ్యాంగులకు, కుష్ఠు వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు, అన్నదానం చేశారు. లయన్స్‌క్లబ్ గవర్నర్ రామచంద్రప్రకాశ్‌రావు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ద్వారా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సభ్యులు సేవా కార్యక్రమాలకు ముందుంటారని తెలిపారు. ఆర్యవైశ్య వృద్ధాశ్రమం వద్ద నిరంతరాయంగా అన్నదానం కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కామిశెట్టి క్రిష్ణమూర్తి, జూటూరు పద్మనాభయ్య, చలపతిరావు, అశోక్‌కుమార్, రవి, రామలింగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలు పాటించాలి


భద్రతా వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఎంవీఐ

పోరుమామిళ్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలు పాటించాలని బైకు నడిపేవారు హెల్మెట్, కార్లు నడిపేవారు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని బద్వేలు ఎంవీఐ శేఖర్‌రావు సూచించారు. గురువారం స్థానిక వెంగమాంబ హైస్కూలులో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 36వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ గుర్రం పుల్లప్ప నాయుడు, నాగలింగేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గుర్రం దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల రికార్డుల తనిఖీ

కలసపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రైవేటు స్కూల్స్ బస్సుల రికార్డులను పోరుమామిళ్ల సీఐ డి.శ్రీనివాసులు, కలసపాడు ఎస్‌ఐ ఘన మద్దిలేటి తనిఖీ చేపట్టారు. డ్రైవర్లు, యాజమాన్యాన్ని గురువారం పిలిపించి వారి బస్సుల కండీషన్‌పై పలురకాల సూచనలు చేశారు. అన్ని బస్సులు కండీషన్‌లో ఉండాలని, అన్నిరకాల రికార్డులు కలిగి ఉండాలని, స్కూలు బస్సు డ్రైవర్లకు యాజమాన్యానికి రోడ్డుభద్రతపై తగు సూచనలు ఇచ్చారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవు

కాశినాయన జనవరి30(ఆంధ్రజ్యోతి): రోడ్డుభద్రతా నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని కాశినాయన ఎస్‌ఐ హనుమంతు పేర్కొన్నారు. గురువారం ఓబుళాపురం మూడురోడ్ల కూడలిలో సిబ్బందితో కలిసి ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు, హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్న 16 మందిని గుర్తించి వారి నుంచి రూ.5860 జరిమానా వసూలు చేశామన్నారు.

బీసీ సంక్షేమం కోసం రూ. 896కోట్లు విడుదల

బద్వేలుటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బీసీ వర్గాల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం రూ.896కోట్ల నిధులను విడుదల చేసినట్లు నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్ అన్నారు. గురువారం బీసీ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ 21 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వరకు అర్హులని, ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు ఏపీ ఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అర్హులకు రూ.2లక్షలు, 3లక్షలు, రూ.5లక్షల వరకు యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ఎంచుకున్న యూనిట్‌లో 50శాతం సబ్సిడీ ఉంటుందని, వీటిని బీసీలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గోవిందాయపల్లె క్రిష్ణయ్య, దంతా వెంకటయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లెంకొండేశ్వరస్వామి గొడుగు మెరవణి

గోపవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మల్లెంకొండేశ్వరస్వామి గొడుగు మెరవణి గురువారం వైభవంగా ప్రారంభించారు. మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గొడుగు మెరవణి బద్వేలు టీడీపీ నేత రితీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మల్లెంకొండకు సమీప గ్రామాల్లో గొడుగు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రసాద్‌రెడ్డి దేవదాయశాఖ కార్యదర్శి రామలింగారెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గీత కార్మికులకు మద్యం షాపు

బద్వేలు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ పాలసీలో భాగంగా 2024-26కు గీత కులానికి ఒక మద్యం షాపు కేటాయించినట్లు ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. ఈషాపును గీత కులాల్లోని ఉప కులమైన ఈడిగ కులానికి కేటాయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.2 లక్షలు రూపాయలు నాన్ రీఫండబుల్ అప్లికేషన్ ఫీజు చెల్లించాలన్నారు. లైసెన్స్ ఫీజు సాధారణ షాపులకన్నా 50 శాతం తక్కువన్నారు. వివరాల కొరకు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

మూడు సిలిండర్ల పట్టివేత

ప్రొద్దుటూరు జనవరి 30 (ఆంధ్రజ్యోతి): డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను రీ ఫిల్లింగ్ చేసి విక్రయిస్తున్న కటారి వీరబ్రహ్మం నుంచి మూడు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మల్లికార్జున పట్టుకున్నారు. స్థానిక సంజీవర్‌నగర్‌లోని గోబీ సెంటర్ వెనుక నడుపుతున్న గ్యాస్ రీ ఫిల్లింగ్ కేంద్రాన్ని అధికారులు గుర్తించారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు రీ ఫిల్లింగ్ చేయడం అక్రమం అని వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మూడు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

11 నుంచి పింఛన్ల తనిఖీ

కొండాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 11 నుంచి 28 వరకు మండలంలోని దివ్యాంగుల పింఛన్లను తనిఖీ చేయనున్నట్లు ఎంపీడీఓ నాగప్రసాద్ తెలిపారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల, కడప తదితర ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల్లో పింఛన్లను డాక్టర్లచే తనిఖీ చేస్తారన్నారు. దివ్యాంగులు ఏ ఆస్పత్రికి వెళ్లాలన్నది సచివాలయ సిబ్బంది ద్వారా సోమవారం నుంచి నోటీసులు జారీచేస్తామన్నారు. వారికి కేటాయించిన తేదీల్లో దివ్యాంగులు తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ తెలిపారు.

రతనాల వేంకటేశ్వరుడికి శ్రవణా నక్షత్ర పూజలు



ప్రొద్దుటూరు టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత మార్కెట్‌లో లలితాదేవి రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి శ్రవణా నక్షత్ర పూజలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున స్వామి వారికి పంచామృతాభిషేకం, స్వామివారి చెల్లెలు లలితాదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తులు

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన బీసీ, ఈబీసీ లబ్ధిదారులు స్వయం ఉపాధి రుణాల దరఖాస్తులను ఫిబ్రవరి 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలానికి మొత్తం 112 యూనిట్లు మంజూరయ్యాయని, కాపు, రెడ్డి, కమ్మ, క్షత్రియ, ఆర్యవైశ్య, ఈబీసీ, బ్రాహ్మణ సామాజిక వర్గాలకు చెందిన బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను పొందేందుకు అర్హులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లో అప్లై చేసుకోవాలని తెలిపారు.

నేడు మండల సమావేశం

గోపవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నేడు మండల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేడు నిర్వహించే మండల సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరవాలని అధికారులకు సూచించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షిస్తామన్నారు. అధికారులు నివేదికలతో హాజరు కావాలన్నారు.